www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024



కోరం లేక మండల మీట్ వాయిదా..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తిరూరల్: కోరం లేక మండల సర్వసభ్యసమావేశం వాయిదా పడింది. 15మంది ఎంపీటీసీలు ఉన్న మండలంలో కేవలం ఎంపీటీసీలు గోవిందరెడ్డి, టి.శాంతి అలాగే వైస్ ఎంపీపీ భానుమూర్తి మాత్రమే సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారని ఎంపీడీవో తెలిపారు. వారం రోజుల నుంచి సమావేశంపై అందరి అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించినా హాజరుకాకపోవడంతో తప్పనిసరి పరిస్థితిల్లో కోరం బలపడక వాయిదా వేసినట్లు ఎంపీడీవో పటాన్ రఫీఖాన్ తెలిపారు. తదుపరి సమావేశం త్వరలో నిర్వహిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

టిడిఆర్ బాండ్ల అవినీతిలో తిరుపతి

- టిడిపి నేతలు మెతక వైఖరి ఎందుకో..?
- నెల్లూరు నేతలు బయటపెట్టిన వైనం..
- ఏమైందని ప్రశ్నిస్తున్న బాధితులు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతిలో టిడిఆర్ బాండ్స్ జారీలో జరిగిన అవినీతిపై తిరుపతి టిడిపి నేతలు ఎందుకు మెతక వైఖరి అవలంభిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు టిడిపి నేత ఆనం వెంకట రమణారెడ్డి తిరుపతిలో రూ.4500 కోట్లు టిడిఆర్ బాండ్లు జారీలో అవినీతి జరిగిందని బయటపెట్టేంత వరకు తిరుపతి టిడిపి నేతలు మేల్కొనలేకపోయారని నగరవాసులు అంటున్నారు. అసలు తిరుపతి టిడిపి నేతలు టిడిఆర్ బాండ్ల జారీలో జరిగిన అవినీతిపై ఎందుకు ఉధృతంగా పోరాటాలు చేయకుండా తూతూమంత్రంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి ఖండిస్తున్నారు తప్ప బాధితులకు అండగా ఉండి పోరాటం చేయడం లేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

గత రెండు సంవత్సరాల నుంచి తిరుపతి నగరంలో 14 మాస్టర్‌రోడ్లను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదంతో చేపట్టారు. ఇందులో తిరుపతి కొర్లగుంట, మారుతీనగర్ 40 అడుగుల రోడ్డు విస్తరణ రోడ్డు, కొర్లగుంట, మారుతీనగర్‌లోని డివిఆర్ రోడ్డు నుంచి హీరో హోండా షోరూం రైల్వే గేట్ వరకు 60 అడుగులు రోడ్డు, చింతలచేను నుంచి కాటన్ మిల్లు రైల్వే గేట్ వరకు 100 అడుగుల రోడ్డు, హీరో హోండా షోరూం నుంచి శ్రీనివాస కళ్యాణ మండపూం వరకు 60 అడుగులరోడ్డు , హీరో హోండా షోరూం నుంచి శ్రీనివాస కళ్యాణ మండపం వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, అంకుర హాస్పిటల్ నుంచి పద్మావతీపురం వరకు 60 అడుగులు, ఎంఆర్‌పల్లి మహిళా యూనివర్సిటీ 80లో రోడ్డు విస్తరణ, కాటన్ మిల్లు సమీపం నుంచి గొల్లవాని గుంట 60 అడుగుల రోడ్డు, కరకంబాడీ రోడ్డులోని గెస్ట్‌లైన్ హోటల్ నుంచి హీరో హోండా షోరూం వరకు 80 అడుగుల రోడ్డు, తిరుపతి గాంధీ విగ్రహం నుంచి గంగమ్మ గుడి ఆలయం వరకు 60 అడుగుల రోడ్డు వేశారు. తిమ్మినాయుడుపాలెం నుంచి కాటన్‌మిల్లు వరకు 100 అడుగుల రోడ్డు వేశారు. చాలామంది సామాన్య మద్దతు ప్రజల భూములు మాస్టర్ రోడ్డుల తీసుకోవడం జరిగింది. మాస్టర్ ప్లాన్‌రోడ్లకు కొందరు స్థలాలు ఇవ్వగా మిగతావారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు కేసులో ఉన్న భూములు కూడా మాస్టర్ ప్లాన్ రోడ్డు తీసుకోవడం జరిగింది. దీనిపై బాధితులు మున్సిపల్ కమిషనర్‌కు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తమకు చెప్పకుండా భూములు ఎలా తీసుకున్నారని తమ గోడును వెలుబుచ్చారు. అయితే టిడిఆర్ బండ్ల జారీలో అధికారపార్టీ వారికి కావాల్సిన వారికి ఇష్టం వచ్చినట్లు మార్కెట్ ధరలు పెంచి ఇతరులకు టిడిఆర్ బండ్లు కట్టబెట్టడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుపతి టిడిపి నేతలు ఏమైంది?

టిడిఆర్ బాండ్ల జారీలో అవకతవకలు జరుగుతున్నాయని, తిరుపతి టిడిపి నేతలు తెలిసిన తమకేమీ తెలియనట్టుగా వివరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆనం వెంకట రమణారెడ్డి టీడీఆర్ బాండ్ల జారీలో అధికారపార్టీ నేతలు భారీగా కట్టబెట్టారని వెలుగులో తీసుకొచ్చారు. అయితే తిరుపతి నేతలు మాత్రం తూతూ మంత్రంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప బాధితులకు అండగా ఉండి పోరాటం చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతిలో జరుగుతున్న టిడిఆర్ బండ్ల అవినీతిపై స్థానిక టిడిపి నేతలు బయట పెట్టకుండా నెల్లూరు జిల్లా టిడిపి నేతలు తిరుపతి అవినీతి బయట పెట్టడంపై స్థానిక నేతల తీరుపై పలు అనుమానాలు బాధితులు వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీ అవినీతికి ప్రతిపక్షపార్టీ అయిన టిడిపి సమర్థవంతంగా ఎదుర్కోవాల్సింది పోయి వారికి వ్యతిరేకంగా పోరాటం చేయడం లేదని అనుమానాలు కలుగుతున్నట్లు బాధితులు అంటున్నారు.

నగరంలో వేసిన 14 మాస్టర్ ప్లాన్ రోడ్లలో టిడిపికి చెందిన భూములు కూడా ఇక్కడ ఉన్నాయని వారి భూములు కూడా టిడిఆర్ బాండ్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. చాలామంది టీడీపీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తే తమ భూములకు ఎక్కడా టిడిఆర్ బాండ్లు రాకుండా అడ్డుకుంటారని భయంతోనే తూతూ మంత్రంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నట్లు నగరంలో ప్రచారం జరుగుతుంది. నెల్లూరు జిల్లా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనం వెంకటరమణారెడ్డి ఇటు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ ఛైర్మన్ ధర్మారెడ్డి బంధువులు ఎక్కువ ధరకు పిడిఆర్ బాండ్ ఇచ్చారని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వీటితోపాటు వైసీపీకి చెందిన వారికి టిడిఆర్ బాండ్లు మొదటగాఇచ్చారనిఆరోపణలు.ఉన్నాయి. ఎన్నికల సమయంలో టిడిపి నేతలు దీనిపై పెద్దగా పోరాటం చేయడం లేదని ఇప్పటికైనా బాధితులకు అండగా ఉండి ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి తన పాత్రను పోషించాలని బాధితులు అంటున్నారు.

ఉపాధి హామీ కూలీలకు

రోజుకు రూ.272లు : కలెక్టర్




ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.272లు వేతనం అందేలా పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మిశ పేర్కొన్నారు. గురువారం డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్‌తో కలిసి రేణిగుంట మండలం, విప్పమానుపట్టేడ పంచాయతీకి చెందిన సూరప్పకసంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేస్తున్న కూలీలకు రోజు వేతనం రూ.272లు వారికి అందేలా వారి ద్వారా పనులు చేయించాలని డ్వామా పిడిని ఆదేశించారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతంలో వర్క్ ఫెసిలిటీస్ కల్పించాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ కూలీలతో మాట్లాడుతూ మీకందరికీ జాబ్ కార్డులు ఉన్నాయా, మీరు ఎన్ని గంటలకు పనికి వస్తున్నారు, మీకు ఎంత రోజుకు వేతనం అందుతుంది, సకాలంలో డబ్బులు వస్తున్నాయా, జాబు కార్డులుండి పనులు కల్పించలేదా, ఇంకా ఎవరికైనా మీ గ్రామంలోని వారికి జాబుకార్డు అవసరం ఉంటే తెలియజేయాలని కూలీలను అడిగి తెలుసుకున్నారు. తాము ఉదయం 6 గంటల కల్లా పనులకు వస్తున్నామని, తమకు రోజుకు సుమారు రూ.268లు వస్తుందని వారంవారం తమ బ్యాంక్ ఖాతాలకు జమఅవుతుందని ఎలాంటి సమస్యలు లేవని కూలీలు కలెక్టర్‌కు తెలిపారు. జాబ్‌కార్డులు ఉండి పనులు కావాలన్న వారి అందరికి పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. రూ.4.54లక్షలతో నిర్మాణం చేపడుతున్న పారం పౌండ్ పనులను విప్పమానుపట్టేడ పంచాయతీకి చెందిన 34మంది కూలీలు గత 20రోజులుగా పని చేస్తున్నారని కూలీలకు పనిచేసే ప్రాంతంలో తాగునీరు కల్పించడం జరుగుతుందని జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తున్నామని పిడి కలెక్టర్‌కు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో కలసి పనులు చేసి వారితో గ్రూప్ ఫోటో దిగడంతో కూలీలందరూ సంతోషించారు. వర్క్ ఐడి ఇంచార్జి జయంతి, ఫీల్డ్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్లు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య మరింత విస్తరణ

తిరుపతి ఐఐటీలో 4, 5 స్నాతకోత్సవం



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా శాస్త్రసాంకేతిక విద్యను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఏర్పేడులోని స్థానిక తిరుపతి ఐఐటీలో గురువారం 4,5 బ్యాచ్‌ల స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఏర్పేడు ఐఐటిల చదువుతున్న విద్యార్థులందరూ అదృష్టవంతులనీ, అటు వెంకన్న- ఇటు శివయ్య సన్నిధానంలో విద్యను తిరుపతి ఐఐటి 2015-16లో ప్రారంభించబడినదనీ, పాలక్కాడ్, జమ్మూ, భిలాయ్, గోవా, ధార్వాడ్‌లలో మరో ఐదు కొత్త ఐఐటీలు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఐఐటి తిరుపతి, ఐషర్ తిరుపతి, మంగళగిరి ఎయిమ్స్ అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీతో సహా రాష్ట్రంలోని ప్రధాన సంస్థలను స్థాపించడం ద్వారా కొన్ని ప్రపంచస్థాయి విద్యాపరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ముందడుగు వేసింది అన్నారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, జేఎస్డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ గ్రాడ్యుయేట్ చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేశారు.

జగన్నాథ సాహిత్యంపై జాతీయ సదస్సు



ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో నూతనంగా నిర్మించబడినటువంటి చెలికాని అన్నారావు బహుళ ప్రయోజక క్లాస్ రూమ్ కాంప్లెక్స్, శ్రీవేంకటాచల బాయ్స్ హాస్టల్, హాస్టల్ కార్యాలయం, విశ్వవిద్యాలయంలో గురువారం కేంద్ర విద్యాశాఖ, కౌశలవికాస శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌వర్చువల్‌గా ప్రారంభించారు. ఆన్లైన్లో ఆయన మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరుని పాదపద్మం దగ్గర విరాజిల్లుతున్నటువంటి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాషను సంరక్షించడంలో, అదేవిధంగా సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రచారం చేయడంలో అగ్రగామిగా ఉందని అన్నారు. వర్చువల్‌గా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ద్వారా ఎన్నో విశేషమైన కార్యాలు సంస్కృత క్షేత్రంలో చేస్తూ దినదినాభివృద్ధి సాధిస్తుందని అభినందనలు తెలిపారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.యస్.ఆర్ కృష్ణమూర్తి ఎంతో చక్కగా విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ప్రత్యేకించి ఉత్కల పీఠం విశ్వవిద్యాలయంలో స్థాపించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రజతమహోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని వివరించారు. అనంతరం ఉత్కలపీఠం డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజనపండా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి ప్రతి ఒక్కరికి కూడా ఆయన ఉత్కలపీఠం తరపున అభినందనలు తెలిపారు. సభాసంచాలకులు సాహిత్య విభాగం ప్రొఫెసర్ శంకర్ నారాయణ, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల పై కమిషనర్ టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : తిరుపతిలో జరుగుతున్న దొంగ ఓట్లు అరికట్టాలని నియోజకవర్గ ఇంచార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్‌ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగినది. తిరుపతి నియోజకవర్గంలోని మహిళా సంఘాలు, ఇతర మహిళా సంఘాలు బలిజ సామాజిక కులస్తులు అధికంగా ఉన్నారని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీకి బలిజ ఓటర్ల సమస్య ఎదురవుతుందని, మహిళా సంఘాల నుంచి బలిజ కులస్థుల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారని దీనిపై వెంటనే విచారించి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. 2024 సంవత్సరంకు వచ్చిన కొత్త ఓటరు లిస్టు సవరణలో కొత్త ఓటరు జాబితాలో తాము గుర్తించిన డెత్, డబుల్ ఎంట్రీలు, షిఫ్టింగ్, దొంగఓట్లను నియోజకవర్గంలో అన్ని పోలింగ్ బూత్‌లలో పరిశీలించి తొలగించకపోతే ఇప్పుడు ఉన్నటువంటి తిరుపతి నియోజకవర్గ ఎన్నికల అధికారులపై తగు సాక్ష్యాధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. పైన తెలిపిన డివిజన్లలో అన్ ఐడెంటిఫైడ్ ఓటర్లు దాదాపు 200 నుంచి 300 మంది ఉన్నారు. వారి వివరాలను గురించి విచారించగా బిఎల్ఓ నుంచి సరైన సమాధానం రావడం లేదన్నారు. కనుక వీటి గురించి విచారణ జరిపి తగినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌సి.మునికృష్ణ, వూకా విజయకుమార్, జెబి.శ్రీనివాస్, రజనీకాంత్ నాయుడు, రఘు పాల్గొన్నారు.

ఉమ్మడి శెట్టిపల్లెలో జగనన్న పట్టాలు ఇచ్చిన వారందరికీ

ఇంటి స్థలాలు చూపండి..



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో 2736 పట్టాలు ఇల్లులేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులందరికీ పట్టాలు పంపిణీ చేసింది. 2020 సంవత్సరంలో ఇచ్చిన పట్టాలు నేటికీ ఒక్కరికి కూడా స్థలాలు చూపించలేదని వారందరికీ స్థలాలు చూపించాలని గురువారం లబ్ధిదారులతో కలిసి సిపిఎం నాయకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వర్గసభ్యులు కే.వేణుగోపాల్ మాట్లాడుతూ 2020 సంవత్సరంలో పట్టాలు ఇచ్చి, అందరికీ ఇళ్లస్థలాలు ఇస్తామని, ఇళ్లు కట్టిస్తామని వాగ్దానాలు చేసి నేటికి నాలుగు సంవత్సరాలు గడిచిన స్థలాలు కేటాయించకపోవడం దారుణమన్నారు. పేదలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో అద్దెలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారని, కుటుంబాన్ని పోషించుకోవడానికి వచే కూలి డబ్బులను ఇంటి అద్దెలకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి శెట్టిపల్లిలోనే రెండు ప్రాంతాల్లో 41 ఎకరాల్లో 2,736 మందికి స్థలాలు కేటాయిస్తామని చెప్పి, ఆ స్థలంలో సర్వేయర్ల ట్రైనింగ్ అకాడమికి కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా ఇక్కడే ఏన్నో ఏళ్లుగా జీవిస్తున్న తమకు శ్రీకాళహస్తి నియోజకవర్గం చిందేపల్లిలో నివాస స్థలాలు ఇవ్వడం ఏమిటని, అక్కడ ఉండటానికి సౌకర్యవంతంగా లేదని, తమకు జీవనోపాధి కోసం ఉదయం కూలికి వెళ్లే తాము అక్కడి నుంచి ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. కనుక తమకు తిరుమల నగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్, చెన్నాయగుంట ప్రాంతాల్లోనే స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారులు కోరారు. స్పందించిన మోహిత్ రెడ్డి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. పార్థసారధి రెడ్డి, కాలనీసభ్యులు చిన్న వెంకటయ్య, బాదుల్లా, హమీద్ పాల్గొన్నారు.

ఎండలో పొర్లు దండాలతో నిరసన



ప్రజాశక్తి - క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒప్పందసేవలు కింద పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం పెంచాలని కోరుతూ అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు ఎర్రటి ఎండలో నడిరోడ్డుపై గోవిందా గోవిందా అంటూ పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. నువ్వు అయినా జగన్మోహన్ రెడ్డికి కళ్ళు తెరిపించాలని మా సమస్య పరిష్కరించాలని గోవిందా అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, ఆప్కస్ రాష్ట్ర అధ్యక్షులు గండికోట చిన్నబాబులు మాట్లాడుతూ యూనివర్సిటీ యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు జీవో ఇచ్చినప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం దాని అమలు జరపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి గత నాలుగు సంవత్సరాల నుంచి పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం పేదలు దళితులు గిరిజనులు రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో కూలికి వెళుతుంటే కనీసం కనికరం లేకుండా వేతనం పెంచకుండా యూనివర్సిటీ యాజమాన్యం వారి జీవితాలతో చెలగాటమాడుతున్నది. బేసిక్ పే, డిఏ, సిసిఏతో కూడిన చేయాలి అగ్రికల్చర్ పరిధిలోని రీసెర్చ్ స్టేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ వివరాలను రీసెర్చ్ స్టేషన్‌లో నమోదు చేయాలని, వారిని టైంస్కేల్ వర్కర్లకు గుర్తించాలని డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ పరిధిలోని వివిధ రీసెర్చ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కాంటాక్ట్ లేబర్‌ను ఔట్సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలి నిబంధనలో ఉన్నప్పటికీ వాటిని యూనివర్సిటీ యాజమాన్యం తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. యూనియన్ నాయకులు వరలక్ష్మి, చంద్రమ్మ, సుబ్బు, మునిలక్ష్మి, రాధా, గిరి, రేవతి, నాగరాజు, నవీన్, చక్రి, మురళి, రత్నమ్మ, లావణ్య, గుణ, గుర్రప్ప, రాధిక, జయంతి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెల హరిని కలిసిన ఆర్టీసీ ఆర్ఎం

శ్రీకాళహస్తి బస్టాండ్ ఆధునీకరణకు తక్షణ ప్రతిపాదన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మాజీ ఆప్కో డైరెక్టర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, వైసీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు మిద్దెల హరిని తిరుపతి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చెంగల్ రెడ్డి గురువారం శ్రీకాళహస్తిలో మర్యాద పూర్వకంగా కలిశారు. మిద్దెల హరి ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్‌గా నియామకాం కావడంపై పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం తిరుపతి జిల్లాలో ఆర్టీసీ బస్టాండ్ల పరిస్థితిపై మిద్దెల హరి ఆర్ఎం ద్వారా ఆరా తీశారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్‌లో మౌళిక వసతుల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయనీ, వెంటనే బస్టాండ్ ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపాలని ఆర్ఎం చెంగల్ రెడ్డిని, డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డిని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆధ్యాత్మిక పట్టణం కావడంతో ఆధునీకరణ పనుల్లో ఆధ్యాత్మికశోభ ఉట్టి పడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అందుకోసం అవసరమయ్యే నిధులు సత్వరమే విడుదలయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా శ్రీకాళహస్తి బస్టాండ్‌కు కొత్త బస్సులు ఏర్పాటయ్యేలా చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ లని తనిఖీ చేసి మౌళిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సీటీఎం భాస్కర్ రెడ్డి, మునిచంద్ర, వైడి కుమార్ పాల్గొన్నారు. చేనేత, జౌళిశాఖ ఎండి పిచ్చేశ్వరరావు, పీవీ సుబ్బానాయుడు కూడా మిద్దెల హరిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీటీడీ ఉద్యోగుల సంక్షేమ నిధిని పునరుద్ధరించాలి

ఉద్యోగ సంఘం నేత కాటా గుణశేఖర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: టీటీడీ ఉద్యోగుల సంక్షేమం కొరకు 45ఏళ్ల కిందట ఏర్పాటైన ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్ (ఈడబ్ల్యూఎఫ్)ను టీటీడీ యాజమాన్యం ఏ చర్చా లేకుండా రద్దు చేసిందని తక్షణం దాన్ని పునరుద్ధరించాలని టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ ప్రధానకార్యదర్శి కాటా గుణశేఖర్ డిమాండ్ చేశారు. తక్షణమే మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి పునరుద్ధరించాలని యాజమాన్యంకు విజ్ఞప్తి చేశారు. 1980 సంవత్సరంలో టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టిటిడి ఈవో, జేఈవో, ఎఫ్ఏ అండ్ సీఏఓలతో పాటు డిప్యూటీ ఇఓ, వెల్ఫేర్ అధికారి ఉంటారని, ఈ ట్రస్ట్‌లో యాజమాన్యం నిర్దేశించిన వారితోపాటు ఉద్యోగి ప్రతినిధులతో ఏర్పాటు చేయాలని ఉందన్నారు. అయితే ఉద్యోగప్రతినిధులకు సంబంధం లేకుండా యాజమాన్యమే ఈ ట్రస్ట్‌ను నిర్వహిస్తూ రావటం సమంజసం కాదని అన్నారు. టీటీడీ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని అన్నారు. యాజమాన్యం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా ఎప్పటికప్పుడు సమీక్షించక 2021 నుండి రిటైరైన వారికి ఇవ్వాల్సిన ఈడబ్ల్యూఎఫ్ చెల్లించలేదన్నారు. 2022 నుండి ఉద్యోగుల నుండి రికవరీ కూడా నిలిపివేశారు. తక్షణం ఉద్యోగుల సంక్షేమనిధిని పునఃప్రారంభించాలని కాటా గుణశేఖర్ ఆప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆస్టర్ నారాయణాద్రిలో

200 గుండె శస్త్రచికిత్సలు విజయవంతం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్‌లో అత్యధిక విజయవంతమైన రేటుతో 200 కార్డియోథొరాసిక్, వాస్కులర్ (సిటివిఎస్) శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఓఓ) డాక్టర్ శ్రీధర్ ముని తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్‌లో ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ త్రిలోక్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అత్యంత అధునాతమైన పరికరాలతో ప్రపంచ దేశాలలో మెరుగైన వైద్యసేవలను ఆస్టర్ అందిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగానే నేడు తిరుపతి హాస్పిటల్‌లో గుండె శస్త్రచికిత్సలలో అత్యంత నైపుణ్యం కలిగిన డాక్టర్ త్రిలోక్ కేవలం 7నెలల కాలంలోనే 200 ఓపెన్ హార్ట్ సర్జరీలు, లంగ్స్ ఆపరేషన్లు చేయడం నిజంగా అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఆయనకు ఆస్టర్ నారాయణాద్రి తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. తమ హాస్పిటల్ విశేషమైన మైలురాయిని దాటిందని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామని, అందులోనూ 90శాతం సర్జరీలను ఆరోగ్య శ్రీపథకం ద్వారా పూర్తి ఉచితంగా చేసి పేద ప్రజల ప్రాణాలను కాపాడడం జరిగిందని తెలిపారు. ఈ స్వల్ప వ్యవధిలో ఇన్ని సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా డాక్టర్ త్రిలోక్ ఆదర్శప్రాయమైన అంకితభావం, నైపుణ్యాన్ని ప్రదర్శించారని సూచించారు. డాక్టర్ త్రిలోక్ నైపుణ్యం కార్డియాక్ బైపాస్, వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు, వాస్కులర్ సర్జరీలు, థొరాసిక్ సర్జరీలతో సహా అనేకరకాల విధానాలను కలిగి ఉందని, వీటన్నింటిని అతను ఖచ్చితత్వం, అనుభవంతో 100శాతం విజయవంతంగా చేయగలుగుతున్నారని తెలియజేశారు. అనంతరం డాక్టర్ త్రిలోక్ పొందూరు మాట్లాడుతూ ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్‌లో అన్ని విభాగాలు ఒకే చోట ఉండడం,ముఖ్యంగా గుండెకు సంబంధించిన అత్యాధునిక పరికరాలు, వసతులు అందుబాటులో ఉండడం వల్లనే ఇంతటి విజయం సాధించగలిగామన్నారు. వారి ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేనిదని తెలిపారు. యాజమాన్యం,వైద్య బృందం సహకారంతో మరిన్ని సర్జరీలను విజయవంతంగా నిర్వహించగలనని ఆశాభవం వ్యక్తం చేశారు. హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇంత తక్కువ వ్యవధిలో అద్భుతమైన సక్సెస్ రేటును సాధించడం నిజంగా అభినందనీయమన్నారు. ప్రతి శస్త్రచికిత్స ప్రక్రియలో డాక్టర్ త్రిలోక్ చూపే అంకితభావం, నైపుణ్యం, రోగుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపుతుందని ప్రశంసించారు. అనంతరం మరో డైరెక్టర్ ఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ అత్యంత శ్రద్ధతో, వృత్తి నైపుణ్యంతో సమాజంలోని ఆరోగ్య సంరక్షణ అవసరాలను అందించడంలో అచంచలమైన అంకితభావాన్ని ప్రదర్శించినందుకు డాక్టర్ త్రిలోక్‌కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ,ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి: ఎస్పీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ మల్లిక గర్గ్ పోలీసులను ఆదేశించారు. గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ తప్పనిసరి అన్నారు. శరణార్థుల పట్ల సానుకూలంగా ఉంటూ వారిలో పోలీసులు ఉన్నారనే భరోసా కల్పించాలన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్ ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా పాత నేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. భాకరాపేట ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిలో దాబాలు, హోటల్ వద్ద రోడ్డుపైనే వాహనాలు నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. గాదంకి టోల్ ప్లాజా, రంగంపేట చెక్‌పోస్ట్ వద్ద ఆకస్మికంగా వాహనాల తనిఖీలను నిర్వహించి, ఎర్రచందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికడుతూ, హైవే పెట్రోలింగ్ వాహనాల నిరంతర రహదారుల యందు తిరుగుతూ నేరాలు జరగకుండా నివారించాలన్నారు. చంద్రగిరి కోట గ్రామం, శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టు మార్గం, తొండవాడ పరిసర ప్రాంతాల నుండి హైవే రహదారుల వరకు నిరంతరం గస్తీ కాయటం బ్లూ కోల్ట్స్, బీట్ సిబ్బందిని బలోపేతం చేసి, మరింత సమర్థవంతంగా పనిచేసే నేర నివారణ చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఉన్న కేడీలు, బీసీలు, డీసీలు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేకమైన నిఘా ఉంచుతూ, సాంప్రదాయకమైన వేగు వ్యవస్థను బలోపేతం చేసుకుని, రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఎప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిఎస్పి శరత్‌రాజ్‌కుమార్, చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డు పరిశీలనలో పలు అంశాలను ఆరాదీస్తున్న ఎస్పీ

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా వాటంబేడు బ్రదర్స్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శివకుమార్, హరికుమార్, రత్నకుమార్, నాగేశ్వరరావు, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌సుబ్బారావు, పెంచలయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్‌కి సన్మానం

ప్రజాశక్తి-గూడూరురూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ ఆసుపత్రి డాక్టర్ ఎస్.సుందర్ కుమార్‌కు సీనియర్ డివిజన్ మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. డీఆర్‌యు సీసీ సభ్యులు రోటరియన్ డాక్టర్ శ్యామసుందరరావు ఈ సందర్భంగా గురువారం సుందర్ కుమార్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

తుడా స్థలంలో ప్రవేశించొద్దు: రవీంద్రయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం రామచంద్ర నగర్ వద్ద ఉన్న భౌంతలమ్మ ఆలయం రోడ్డు విస్తరణలో భాగంగా దెబ్బతిని ప్రమాదం ఉండటంతో ఆలయానికి ఆనుకొని ఉన్న తుడా కాలి స్థలాన్ని ఆలయ నిర్వహణకు వినియోగించుకోవడానికి గ్రామస్తులు ప్రయత్నించడంతో తుడా అధికారులు అడ్డుకున్నారు. చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 176/2లో గల రెండు ఎకరాల తుడా స్థలంలో కొంత భాగం వినియోగించుకోవడానికి స్థానిక గ్రామస్తులు చేసిన ప్రయత్నాన్ని తుడా అధికారులు అడ్డుకోవడంతో గ్రామస్తులు తుడా చైర్మన్, తుడా విసికి సమస్యను వినతి రూపంలో విన్నవిస్తామని అక్కడ నుండి వెళ్లిపోయారు.

గ్రీన్ ట్రిబ్యునల్‌కు తప్పుడు నివేదికలా?: నరసింహయాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అధికార పార్టీకి దాసోహం అయిన అధికారులు పర్యావరణానికి హాని కలిగించేలా ఖనిజ సంపదను దోచుకున్న విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్‌కు కూడా తప్పుడు నివేదికలు అందించారని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ ధ్వజమెత్తారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతాల్లో ఖనిజ సంపదను అడ్డంగా దోచుకుంటూ ఎక్కడ ఇసుక రిచ్‌లు లేవని సాక్షాత్తు జిల్లా కలెక్టర్లు నివేదికలు గ్రీన్ ట్రిబునల్‌కు అందించారని, అయితే గ్రీన్ ట్రిబునల్ బృందం 100అడుగుల లోతుకు ఇసుక తవ్వకాలను గుర్తించిందన్నారు. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాల్లో రాత్రి వేళల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భారీ జెసిబి యంత్రాలను ఉపయోగించి టన్నులకు టన్నులు ఇసుక సరిహద్దు రాష్ట్రాలకు తరలించి కోట్ల రూపాయలు వెనకేసుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రతిపక్ష టిడిపి పార్టీగా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై రూ.18కోట్ల జరిమానా విధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వుకా విజయ్ కుమార్, మునికృష్ణ, చెంగయ్య, కృష్ణయ్య, సురేష్ పాల్గొన్నారు.

మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వాయులింగేశ్వర మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.షాహిర్, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా కేహెచ్ ప్రసాద్‌లు ఎంపికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా జుంలేషా, కోశాధికారిగా హుమాయున్, ఉపకార్యదర్శులుగా శరత్, శంకర్, అరుణ్, పిఆర్‌ఓగా ముబారక్, ఏపీఆర్‌ఓగా షఫీ, సభ్యులుగా వెంకటాద్రి, మోహనకృష్ణ, ఫిరోజ్, వినోద్, శివచంద్ర క్రాంతిలు ఎన్నికయ్యారు. మొబైల్స్ సేల్స్, సర్వీస్ దుకాణాల యజమానుల సమస్యల పరిష్కారంకై అసోసియేషన్ కలిసికట్టుగా పనిచేస్తుందని వారు తెలిపారు.

టిడిఆర్ బాండ్లపై విచారణ జరిపిస్తాం: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భూమి కోల్పోయిన వారికి ఇచ్చిన టిడిఆర్ బాండ్లపై టిడిపి అధికారంలోకి రాగానే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేలకోట్ల రూపాయలు అక్రమంగా దోచుకున్నారని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ అవసరమన్నారు. కొడుకు ఎమ్మెల్యే కావడానికి ప్రస్తుత ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి టిడిఆర్ బాండ్ల విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. అధికారుల అండదండలతో వైసీపీ నాయకులు యథేచ్ఛగా భూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యలకు ఊతమిచ్చేలా సహకరించిన అధికారులు ఇకనైనా ఆలోచించి న్యాయం వైపు నిలబడాలని సూచించారు. ఇంకను అధికార వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తే భవిష్యత్తులో చర్యలు అనుభవించక తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో దంపూరు భాస్కర్‌యాదవ్, బుల్లెట్ రమణ, పుష్పలత, శాంతమ్మ, అనిత పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కేవిబిపురం: మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షా సామగ్రి పంపిణీ పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాల ఉషా, మోడల్‌స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, అజిత్‌గురూజీ, జయకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ విచారణ జరపాలి: మధు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరపాలక సంస్థలో శెట్టిపల్లి పంచాయతీ నుండి విలీనం కాబడి మినహా ఉన్న హాబిటేషన్స్‌తో ఏర్పడిన న్యూ మంగళం పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధిపై బహిరంగ విచారణ జరపాలని పంచాయతీ వార్డు సభ్యులు మధు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పత్రికల్లో న్యూ మంగళం పంచాయతీ గురించి వస్తున్న కథనాలపై వార్డు మెంబర్ మధు స్పందించారు. పంచాయతీ పరిదిలో ఉన్న హ్యాబిటేషన్స్ చంద్రగిరి నియోజకవర్గానికి వస్తాయా?, లేక నగరపాలక సంస్థలో ఉన్నాయా అన్న విషయాలను, ఇప్పటివరకు అభివృద్ధి కోసం ఏఏ నిధులు ఎక్కడ వినియోగించారు పూర్తి వివరాలను పంచాయతీ ప్రజల ముందు ఉంచి బహిరంగ విచారణ అధికారులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో గ్రామ పంచాయతీకి వచ్చిన ఆదాయ, వ్యయ, ఆడిట్ వివరాలను ప్రజలకు తెలిసేలా నివేదిక ఇవ్వాలన్నారు. అలానే పంచాయతీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ఓకే కాంట్రాక్టర్‌కు ఏ విధమైన అర్హతతో పనులు అప్పగించారో తెలపాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పద్మావతి, సుజన, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వివిధ పాఠశాలలను గురువారం ఎంఈవో మునిసుబ్రమణ్యం పరిశీలించారు. మధ్యాహ్నం భోజన వడ్డింపు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. భోజన రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. ఆ తరువాత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రొజెక్టర్ వితరణ

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు ద్వారకనాథరెడ్డి, దామోధర్‌రెడ్డిలు ప్రొజెక్టర్ వితరణ చేశారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబుకి అందజేశారు.

'విజిలెన్స్ పేరిట అధికారులపై చర్యలు సరికాదు'



ప్రజాశక్తి-గూడూరుటౌన్: పంచాయతీ రాజ్ ఇంజనీర్లను ప్రభుత్వం విజిలెన్స్ పేరిట చర్యలు చేపట్టడం సరి కాదని ఏపీ పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం గౌరవఅధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ 2014-19 సంవత్సరం మధ్యలో రాష్ట్రం మొత్తం పంచాయతీరాజ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో సిమెంట్ రోడ్లు వేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు విజిలెన్స్ పేరిట ఇంజనీర్లను వేధించడం సరికాదన్నారు. పనుల్లో అవకతవకలు జరిగి ఉంటే గుత్తేదారులకు ప్రభుత్వం నుండి రావాల్సిన బాకాయిలును చెల్లించవద్దని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ దాడులను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వి.వి.దయాళ్, కోశాధికారి మునికుమార్, డి.ఈ.ఈలు రామచంద్రయ్య, రవీంద్రకుమార్, కృష్ణబాబూ, ఏ.ఈలు కవిత, వెంకటేశ్వర్లు, ఎలియాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి హద్దులు లేవు



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: దేశాలకు హద్దులున్నా మానవత్వానికి ఎలాంటి హద్దుల్లేవని మోటివేటివ్ స్పీకర్ బ్రదర్ సిరాజ్ అన్నారు. చిత్తూరులోని కార్పొరేటర్ అలీ నివాసంలో బ్రదర్ సిరాజ్‌కి గురువారం తేనీటి విందును ఏర్పాటు చేశారు. తేనీటి విందు అనంతరం బ్రదర్ సిరాజ్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, అయితే మతాలు, జాతుల పేరిట అంతరాలు సృష్టించుకోవడం తగదన్నారు. ప్రపంచంలో అన్ని మతాల సారాంశం ఒక్కటేనన్నారు. ప్రతి ఒక్కరూ కృతజ్ఞతాభావం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగరంలోని పలు మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి: వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: వర్సిటీ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిందేనని, కాదని వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని వీసీ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఇంజనీరింగ్ విభాగాన్ని, న్యాయ కళాశాల, క్యాంటీన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, పనితీరుపై నేరుగా వివరాలు తీసుకున్నారు. ఇంజనీరింగ్ ఆఫీసు సమయంలో 13మంది గైర్హాజరుపై వివరాలు సేకరించి సంబంధిత ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. సమయపాలన విషయంలోనూ ఖచ్చితంగా వుండాలని ఉద్యోగులకు మార్గదర్శకాలు ఇచ్చారు.

'అమృత్ వికసిత్ భారత్' పై అవగాహన

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యా సంస్థలు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, అఖిలభారత సాంకేతిక విద్యా మండలి సూచనల మేరకు అమృత్ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ సదస్సులో చెన్నైకి చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్, శాస్త్రవేత్త వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మన దేశం అభివృద్ధి పథంలో ఎలా పరుగుడుతుంది? అందుకోసం ఇంజనీరింగ్ విద్యార్థులు ఎలా కృషి చేయాలి అనే అంశంపై వివరించారు. కరస్పాండెంటు రవీంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అది కొద్ది కళాశాలలో మదర్ థెరిసా కళాశాల ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని ఒక విద్యార్థి ఈ విషయాన్ని గుర్తుంచుకొని దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అధిక రాజేందర్ రెడ్డి, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయూబ్ ఖాన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు కు చెందిన ప్రముఖ సామాజికవేత్త, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ వ్యవస్థాపకులు పి. అయూబ్ ఖాన్ గౌరవ డాక్టరేట్ వరించింది. తెలంగాణకు చెందిన స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ సికింద్రాబాద్ వారు సామాజిక సేవ మతసామరస్యం, పరమతసహనం పై ఆయన చేస్తున్న కృషిని గుర్తించి యూనివర్సిటీ డైరెక్టర్ మార్టిన్ కర్టిగా ఈ గౌరవ డాక్టరేట్ ను తెలంగాణలోని సికింద్రాబాద్ లో గురువారం అందించారు. సామాజిక సేవతోపాటు మతసామరస్యాన్ని ప్రోత్సహించడంతో పాటు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఆయనను గౌరవ డాక్టరేట్ కు ఎంపిక చేశారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి అయూబ్ ఖాన్ కు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు, అభినందనలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యార్థులుఉన్నతశిఖరాలకుచేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు భేరీనాథ్ అన్నారు. గురువారం మండలంలోని గుండ్ల కట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్యార్థులు వెళ్లడం ఆనందంగా ఉందని, రాబోవు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి మంచి పేరు తీసుకురావాలని సమాజంలో ఉత్తమంగా మెలిగి అందరి మన్ననలు పొందా లన్నారు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాం, పద్మనాభ రెడ్డి, సురేష్, పలువురు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

- స్కూటరిస్టుకు గాయాలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని ద్విచక్ర వాహన దారుడు గాయాలపాలైన సంఘటన గురువారం చంద్రగిరి మండలం కాశిపెంట్ల జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. యర్రావారిపాళ్యం మండల బోడేవాండ్లపల్లికి చెందిన రెడ్డెప్ప(30) బుధవారం తన ద్విచక్ర వాహనంలో తిరుమల శ్రీవారిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో చంద్రగిరి, పాకాల మీదుగా పీలేరులో ఉంటున్న తన బంధువుల ఇంటికి బయలుదేరాడు. చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రెడ్డెప్పకు తీవ్రగాయాలైయ్యాయి. స్థానికులు గుర్తించి 108లో తిరుపతి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: తిరుపతి పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనానికి పాల్పడుతున్న ఐదు మందిని అదుపులో తీసుకున్నట్లు తిరుపతి ఎస్పీ మల్లిక గార్గ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి పోలీసులు నిఘాలో బుచ్చినాయుడుపల్లికి చెందిన సాత్విక్(19), కన్నెవారిపల్లెకు చెందిన సైక్ అబ్దుల్ కరీం(25), నెరబైలుకు చెందిన ఎర్ర బాలాజీ(24), పెనుమూరు మనం చిపురుపల్లికి చెందిన జస్వంత్(20), బంగారుపాలెం మండలం తుంబపాలెం గ్రామానికి చెందిన ధనశేఖర్(26)ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 12బైక్‌లు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించమన్నారు. సిబ్బందిని అభినందించారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

ప్రజాశక్తి-బాలాయపల్లి: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహబూబ్ సుభాన్ తెలిపారు. తిరుపతి నుంచి వెంకటాచలం మండలం మనుబోలు గ్రామానికి తరలిస్తున్న సమాయంలో అడ్డుకొని 3టన్నుల కోళ్ల వ్యర్థాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్థానికుల దాడిలో యాత్రికుడి మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-రేణిగుంట: యాత్రికులపై స్థానికులు దాడి చేసి పూణేకు చెందిన ఓ యాత్రికుడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీవారి దర్శనానికి పుణే నుంచి 15మంది బృందం తిరుపతికి వచ్చారు. వారు రేణిగుంట సమీపంలోని ఓ డాబా వద్ద బుధవారం అర్థరాత్రి భోజనం చేస్తుండగా స్థానికులు ఓ బృందం డాబా వద్దకు వచ్చారు. అక్కడ పూణేకు చెందిన బృందం భోజనంపై దుమ్ము పడటంతో స్థానికులను ఇదేమిటని పూణే బృందం ప్రశ్నించారు. దీంతో ఆగ్రహావేశంతో స్థానికుల బృందం పూణేబృందంపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు. గాయపడిన వారికి తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ పూణేకు చెందిన వృసంత్ జగతప్(45)మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత బంధువుల ఫిర్యాదుపై సీఐ మల్లికార్జున కేసు దర్యాప్తు చేస్తున్నారు.

26న రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభం

ప్రజాశక్తి-దొరవారిసత్రం: పూర్తయిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలను ప్రధానమంత్రి చేతుల మీదుగా ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు సదరన్ రైల్వే డివిజనల్ మేనేజరు విశ్వనాథ్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని అక్కరపాక, మినమలమూడి, నేతాజీనగర్, దొరవారిసత్రంలలో పూర్తయిన నిర్మాణపు పనులను ఆయన తనిఖీ చేశారు.

పాఠశాల మరుగుదొడ్ల పునరుద్ధరణ

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: తడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా కంపెనీ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ఇకరషి తకావో, బాలుర కోసం పునరుద్ధరించిన మరుగుదొడ్ల సముదాయాలను హెడ్‌మాస్టర్ సురేష్‌కి లాంఛనంగా అందజేశారు.

'పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి'

ప్రజాశక్తి-బాలాయపల్లి: పిల్లలపై తప్పనిసరిగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులు సంస్కృత కార్యక్రమాలు అందిరినీ ఆకట్టుకున్నాయి.

మెరుగైన వైద్య సేవలకు ప్రభుత్వ కృషి: రోజా

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం పట్టణంలోని గోవిందపాళ్యం సమీపంలోని బైపాస్ రోడ్డులో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ప్రజలకు అందుబాటులోకి అన్ని రకాల సేవలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, హరి, జయప్రకాష్, శంకర్, కేఎల్ఎంరెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రేణిగుంట: రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆ సంస్థ అధికారి నాగరాజు తెలిపారు. గురువారం మండలంలోని అన్నాసామి పల్లిలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రేణిగుంట ఏరియా ఆసుపత్రి వెటర్నరీ డాక్టర్ స్రవంతి, కెవికె డాక్టర్ అనూష బృందం వైద్య సేవలు అందించారు. పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి వెంకటేష్, అన్నబలగన్, ఇందుమతి, శంకరయ్య, స్వాతి, నాగమణి పాల్గొన్నారు.

కస్తూరిబా గాంధీకి ఘన నివాళి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ 79వ వర్ధంతి సందర్భంగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పిసి రాయల్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీరోడ్‌లోని అదృష్ట కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 20సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతినెలా కర్మను తప్పకుండా డాక్టర్ పిసి రాయల్ ఆధ్వర్యంలో పేదలకు బట్టలు పంపిణీ, అన్నదాన కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు రుద్రరాజు శ్రీదేవి, రామచంద్రారెడ్డి, బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయం: వినూత



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే ఎన్నికల్లో వైసిపి ఫ్యాన్ రెక్కలు విరిగడం ఖాయమనీ, జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం రావడం తథ్యమని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వినుత కోటా అన్నారు. పట్టణంలోని పెండ్లి మండపం, గాంధీ వీధి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. వినుత ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ-జనసేన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేనకు ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట గణేష్, జ్యోతిరామ్, ఉపాధ్యక్షులు రవికుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్, కవిత, రాజ్యలక్ష్మి, ఐటీ కోఆర్డినేటర్ కావలి శివకుమార్, మండల అధ్యక్షుడు రాఘవయ్య, చంద్రశేఖర్, నాయకులు నక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి హార్లీ డేవిడ్సన్ వెహికల్ విడుదల



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: హీరో మోటార్ క్రాఫ్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన హార్లీ డేవిడ్సన్ వెహికల్‌ను గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. స్థానిక మానస సరోవరం హోటల్లో జరిగిన కార్యక్రమానికి ఆ సంస్థ ఏరియా మేనేజర్ విజయ్ కానహన్, పృథ్వి షోరూమ్ అధినేతలు పృథ్విరెడ్డి, మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ కొత్త వెర్షన్ వెహికల్‌కి మంచి డిమాండ్ ఉందన్నారు. కేవలం రూ.రెండు లక్షలు 59,500 స్టార్టింగ్ ప్రైస్‌తో ఈ వాహనాన్ని సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక మంది ఈ వాహనాన్ని బుక్ చేసుకున్నారని, ఆసక్తి గల వినియోగదారులు కొత్త వెర్షన్ వెహికల్‌ను కొనుగోలు చేసి, సరికొత్త అనుభూతిని సొంతం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ హిమబిందు, నెట్వర్క్ మేనేజర్ పూర్ణచంద్ర, వినియోగదారులు, ఆ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తరాలుగా సామాజిక జాడ్యంగా వస్తున్న బాల్య వివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వరెడ్డి పిలుపునిచ్చారు. బాల్యబాల్య వివాహాల నిర్మూలనపై గురువారం శ్రీకాళహస్తి వన్ టౌన్‌పోలీస్ స్టేషన్, ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో శ్రీకాళహస్తిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవంలో బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. బాల్య వివాహాలకు ఎలా అడ్డుకట్ట వేయాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, మెప్మా మహిళలకు సూచనలు చేశారు. బాల్య వివాహాలు చేసుకున్నా ప్రోత్సహించినా అమలయ్యే శిక్షలపై అవగాహన కల్పించాలని చెప్పారు. నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. వన్ టౌన్ సిఐ నరసింహారావు, సిడిపిఓ శాంతి దుర్గ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని టీచింగ్, టీచింగ్‌స్టాఫ్ విద్యార్థులకు గురువారం మహిళా వర్సిటీ హ్యూమానిటీస్ బ్లాక్ నందు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించాలి: సీపీఐ

ప్రజాశక్తి-నారాయణవనం: పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని మండల సీపీఐ కార్యదర్శి మునిశంకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం పాలమంగళంలో మానవహారం చేపట్టారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ పరిశుద్ధ్య కార్మికులు నినాదాలు చేశారు.

ముగిసిన నామినేషన్లు

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వియూ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ముగిసిందని ఎన్నికల అధికారి లోకనాథం వెల్లడించారు. 28వ తేదీన నిర్వహించే ఎన్నికలకు బుధవారంతో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని ఆయన వివరించారు. సొసైటీకు నిర్వహించే ఎన్నికలలో 9డైరెక్టర్ పోస్టులకు గాను 18మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని చెప్పారు. ఎన్నికల పోటీలో నిలబడిన అభ్యర్థులందరికీ ఎన్నికల గుర్తును కేటాయించడం జరిగిందన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రశాంతంగా క్రెడిట్ సొసైటీ ఎన్నికలు నిర్వహించడానికి అభ్యర్థులు తప్పనిసరిగా సూచనలు పాటించాలని వివరించారు.

తిరుపతి రాజధాని

కావాలి: చింతామోహన్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: అమరావతి, విశాఖపట్నం కంటే తిరుపతిని బెస్ట్ రాజధాని అవుతుందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. [illegible] పుత్తూరురైల్వేస్టేషన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి తిరుపతి రాజధాని కావాలని ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, చిరంజీవి, తేజోవతి, సింధుజ పరదేశి

మృతుల కుటుంబాలకు సిపాయి భరోసా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తిరూరల్: మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో ఇటీవల రాజేష్, బత్తెయ్య అనే ఇద్దరు వ్యక్తులు ఆనారోగ్యం కారణంగా గత కొద్ది రోజుల క్రితం మరణించడం జరిగింది. గురువారం రష్ హాస్పిటల్ అధినేత.. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఇరువురి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండటానికి సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడ 40రకాల నిత్యవసర సరుకులు వారికి అందజేశారు. కార్యక్రమంలో మధురెడ్డి, దేవప్రనాంద్, భాస్కర్, వెంకటాద్రి, దాము, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ వ్యవహారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని అక్కసముద్రం రెవెన్యూ పరిధిలోని ఓ భూ సమస్యపై స్థానికులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సమస్యను పరిష్కరించాలని కోరారు.

'వరల్డ్ థింకింగ్ డే' పై ర్యాలీ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ప్రపంచ ఆలోచన దినోత్సవం సందర్భంగా గురువారం పుత్తూరులో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జయదేవ్, యువశ్రీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.